21న జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం

ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ సిహెచ్.దేవప్రకాష్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం ఈ నెల 21వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశం హాల్లో నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ సిహెచ్.దేవప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గోదావరి పశ్చిమ డెల్టాకు రబీ సీజన్‌కు సంబంధించి నీటి లభ్యత, ఆయకట్టు గురించి, 2024-25 రబీ అనంతరం కాలువలు మూసివేసే తేదీ నిర్ణయం, జిల్లాలోని మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి పంట విస్తీర్ణం, నీటి విడుదల తేదీ నిర్ణయం, తదితర అంశాలు చర్చించనున్నట్లు తెలిపారు.

'కౌలు' కష్టం..!

- అగమ్యగోచరంగా కౌలురైతుల పరిస్థితి
- పంటరుణాలిచ్చేందుకు బ్యాంకర్లు ససేమిరా
- ఉన్నతాధికారుల ఒత్తిడితో విదిలిస్తున్న వైనం
- పశ్చిమలో రూ.105 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ. 140 కోట్లు మాత్రమే
- కోతయంత్రాల ఛార్జీల వసూలుపై కొరవడిన నియంత్రణ
- ఎకరాకు రూ.3వేలకు పైగా రైతుల నుంచి దోపిడీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒక పక్క బ్యాంకుల నుంచి పంట రుణాలందక, ఎరువులు, పురుగుమందులతోపాటు, కోత యంత్రాల ఛార్జీల పెంపుతో పెట్టుబడులు పెరిగి అన్నదాత పడుతున్న కష్టాలు వర్ణణాతీతంగా మారాయి. కౌలు రైతులకు పంటరుణాల మంజూరులో బ్యాంకర్లు తీవ్ర వివక్ష చూపుతున్న పరిస్థితి కొనసాగుతోంది. రెండు జిల్లాల్లో జారీ చేసిన కౌలు కార్డులకు, బ్యాంకర్లు ఇచ్చిన పంట రుణాలకు సంబంధం లేకుండా పోయింది. ఏలూరు జిల్లాలో మొత్తం 64,873 కౌలు కార్డులు (సిసిఆర్‌సి) జారీచేయగా ఇప్పటి వరకూ రుణాలు అందుకున్న రైతులు 22,798 మంది మాత్రమే. ఇచ్చిన రుణం కూడా కేవలం రూ.140 కోట్లే. ఈ రుణం సైతం సైతం పూర్తిగా కౌలుకార్డుల ప్రాతిపదికన ఇవ్వలేదు. సిసిఆర్‌సి, జెఎల్‌జి, ఆర్‌ఎంజి గ్రూపులకు మొత్తం కలిపి ఇచ్చిన రుణం మాత్రమే. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలురైతులకిచ్చిన రుణం ఒక్కశాతం కూడా లేదంటే ఆశ్చర్యపోక తప్పదు. పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేల మంది కౌలు రైతులకు కౌలు కార్డులు జారీకాగా, రుణం అందుకున్న రైతులు 23 వేల మంది మాత్రమే. ఇచ్చిన రుణం కేవలం రూ.105 కోట్లే. ఖరీఫ్ పూర్తయ్యి, రబీ సాగుకు సైతం రైతులు సన్నద్ధమవుతున్న పరిస్థితి నెలకొంది. రబీకి సంబంధించి అక్టోబర్ నుంచి బ్యాంకులు రైతులకు రుణాలు మంజూరు చేస్తున్నాయి. రుణాలు మాత్రం సాగుచేసే కౌలురైతులకు కాకుండా, భూ యజమానులకు ఇస్తున్న పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం కౌలురైతులే చేస్తున్నారు. సాగులో కీలకపాత్ర పోషిస్తున్న కౌలు రైతులకు మాత్రం బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. దీంతో పెట్టుబడుల కోసం కౌలు రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతం. కౌలుకార్డుల విషయంలోనూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కౌలు రైతులు, రుణాల కోసం యుద్ధమే చేయాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. ఇచ్చిన రుణాలు సైతం కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు బ్యాంకర్లపై తెస్తున్న ఒత్తిడితో ఇస్తున్నవే. అంతే తప్ప కౌలురైతులకు అండగా నిలబడాలన్న ఆలోచనలో బ్యాంకర్లు లేకుండా పోయిన పరిస్థితి నెలకొంది.

కోతయంత్రాల ఛార్జీలతో పెట్టుబడి తడిసి మోపెడు..

వరిసాగులో పెట్టుబడి విపరీతంగా పెరిగిపోవడంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎరువులు, పురుగుమందులు ఖర్చులు ఇప్పటికే ఆకాశాన్ని తాకాయి. ఇప్పుడు కోతయంత్రాల ఛార్జీలు సైతం రైతులను వణికిస్తున్నాయి. ఇప్పటి వరకూ గంటకు రూ.2,600 చొప్పున వరికోతకు వసూలు చేసేవారు. ఇప్పుడు ఏకంగా రూ.మూడు వేల నుంచి రూ.3,500 వరకూ వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఈదురుగాలులకు అత్యధిక పొలాలు నేలకొరిగిన పరిస్థితి నెలకొంది. దీంతో ఎకరా కోయడానికి రెండు నుంచి మూడు గంటలు కూడా పడుతోంది. దీంతో ఎకరాకు కో త యంత్రాలకు రూ.తొమ్మిది వేల నుంచి రూ.పది వేలు ఖర్చవుతోంది. ఊహించని స్థాయికి కోత యంత్రాల ఖర్చు పెరగడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కోతయంత్రాలు యజమానులంతా ఒక్కటిగా కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. కోతమిషన్ల ఛార్జీలపై గతంలో అధికారులు కొంత నియంత్రణ చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో వాటి యాజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని కోతయంత్రాల ఛార్జీలను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు. సాగుచేసే కౌలురైతులకు సరైన ఆదరణ లేకపోవడంతో వారి కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్న పరిస్థితి నెలకొంది. కౌలు చట్టంలో మార్పులు చేస్తాయని చెప్పిన ప్రభుత్వం మిన్నకుండిపోయింది. దీంతో రబీలోనూ కౌలురైతులకు న్యాయం జరగని పరిస్థితి నెలకొంది.

ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోవాలి

జిల్లా కలెక్టరు కె.వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు వినియోగించాలని, బహిరంగ మలవిసర్జన నివారించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పలువురు పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. సత్కారం పొందిన వారిలో ఏలూరు కార్పొరేషన్‌కు చెందిన ఎం.దుర్గారావు, జి.రంగారావు ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ మరుగుదొడ్డి ఆత్మగౌరవానికి చిహ్నమని, ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ నెల 19 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకూ హమారా సౌచాలయ్ హమారా సమ్మాన్ అనే నినాదంతో జిల్లా అంతటా రోజుకో కార్యక్రమాన్ని జరిపేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. గ్రామాల్లో సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, వాడకంపై గ్రామాల్లో సర్వే నిర్వహించడం జరిగిందని, టాయిలెట్ లేనివారికి మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.



పారిశుద్ధ్య కార్మికులను సత్కరించిన కలెక్టర్ వెట్రి సెల్వి

డిసెంబరు 5వ తేదీ వరకూ వ్యక్తిగత మరుగుదొడ్లు, సామాజిక మరుగుదొడ్లు వాడకంపై పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు తదితరాల్లో మరుగుదొడ్లు పని విధానం, వాటికి నీటి సదుపాయం ఉందీ లేనిదీ పరిశీలించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 10వ తేదీ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరీ ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ఇ ఇన్‌ఛార్జి త్రినాథ్‌బాబు పాల్గొన్నారు.

43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రీరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇంతవరకూ 99.05 కోట్ల రూపాయల విలువైన 43,004.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రీరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ధాన్యాన్ని సమీపంలోని రైస్ మిల్లుకు తరలించినట్లు తెలిపారు. ప్రత్యేకించి ఉంగుటూరు మండలంలో నేటి వరకూ 37.50 కోట్ల రూపాయల విలువైన 16,301.800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లుకు పంపినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై బ్యానర్లు, కరపత్రాల ద్వారా, రైతు సదస్సుల ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు ధాన్యం విక్రయించేందుకు ఆసక్తి గల రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలోని సిబ్బంది స్వయంగా కళ్లాల వద్దకు వచ్చి రైతులు పండించిన ధాన్యాన్ని పరీక్షించి నిబంధనల ప్రకారం ఉంటే కనీస మద్దతు ధర క్వింటాల్ సాధారణ రకం రూ.2,300, గ్రేడ్ ఏ రకం రూ.2,320 చొప్పున కొనుగోలు చేసి రైసు మిల్లుకు తరలించిన 48 గంటల్లోపే రైతు బాంకు ఖాతాలో ధాన్యం సొమ్ము జమ చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహాలున్నా 08812-230 448, 7702003584, టోల్ ఫ్రీ 18004256453) నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

నేవీ ఆయుధ డిపోను ఏజెన్సీ నుంచి తరిమికొట్టాలి

సిపిఎం మండల మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతం నుంచి నేవీ ఆయుధ డిపోను తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురంలో సిపిఎం 8వ మండల మహాసభ నిర్వహించారు. ముందుగా మల్లు.దొర ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కమ్యూనిస్టు యోధులు సీతారాం ఏచూరి, ఆర్‌ఎస్ఆర్, కన్నప్ప చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ మండలంలోని వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్న నేవీ ఆయుధ సామగ్రి డిపోను ఏజెన్సీ ప్రాంతం నుంచి తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో రెండు సార్లు గ్రామ సభలు ఏర్పాటు చేస్తే పంచాయతీలోని గ్రామస్తులంతా ముక్తకంఠంతో ఏకగ్రీవంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. మరలా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ఎంఎల్ఎ, ట్రైకర్ ఛైర్మన్ల ఆధ్వర్యంలో మరోమారు గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ గ్రామసభను కూడా వ్యతిరేకించి మళ్లీ మా గ్రామంలో ఆయుధ కర్మాగారం అంటూ రావద్దని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. మరలా ఇటీవల ఏలూరు ఎంపీ ఆయుధ కర్మాగారాన్ని పెట్టేందుకు గ్రామ సభ పెట్టాలని చూస్తున్నారని ఇదే గనక జరిగితే గిరిజన, గిరిజనేతరులు అంతా ఏకమై ఏజెన్సీ ప్రాంతం నుంచి తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. పునరావాస కాలనీల్లో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ గ్రామాల్లో ఇప్పటికీ సరైన రహదారులు లేవని, ప్రభుత్వం వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం మూడేళ్లుగా సిపిఎం ఆధ్వర్యంలో చేసిన భూ పోరాటాలు, సేవా కార్యక్రమాలు చేసిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ మూడేళ్లల్లో పెద్ద ఎత్తున భూ పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లింగరాజు, తెల్లం.రామకృష్ణ, ఎం.నాగమణి, మండల నాయకులు తెల్లం.దుర్గారావు, ఎస్.సీతారామయ్య, సిహెచ్.కొండలరావు, కారం.నాగదుర్గ, దావీదు, అప్పారావు, దానియేలు, గంగరాజు, పాల్గొన్నారు.

నేతలకు నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి, నాయకులు

సిపిఎం మండల కార్యదర్శిగా శ్రీను

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు సిపిఎం మండల కార్యదర్శిగా భయ్యాన శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కుక్కునూరులో నిర్వహించిన తొమ్మిదో మండల మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. ప్రజలకు ఎదురవుతున్న పలు సమస్యలపై మహాసభలో ప్రతిపాదించారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యల పరిష్కారం, ఆదివాసీల సాగులో ఉన్న పోడు భూముల హక్కులు, మండలంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని, స్థానిక సమస్యల పరిష్కారం, 18 సంవత్సరాలు నిండిన యువతకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ సాధన, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి కోసం పనిచేయాలని భవిష్యత్తు కర్తవ్యాలను తీర్మానించారు. సిపిఎం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులుగా యర్రంశెట్టి నాగేంద్రరావు, యర్నం సాయికిరణ్, మేడిపల్లి బాబు, పట్ల లక్ష్మయ్య, పులదాసు రమేష్, షేక్ వలిపాషా, పట్ల సీతమ్మ, వర్స వీరస్వామి, శ్యామల, లక్ష్మణరావు ఎన్నికయ్యారు.

విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను, కొత్తగా బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వర్తక వాణిజ్య వర్గాలు, ప్రజలంతా వ్యతిరేకించాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. మంగళవారం స్థానిక మర్చంట్ ఛాంబర్ జిల్లా అధ్యక్షులు నేరెళ్ల రాజేంద్రను సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సెక్రటరీ బండి వెంకటేశ్వరరావు, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జి.నాగేశ్వరరావు కలిసి రాష్ట్ర ప్రభుత్వం వర్తక వాణిజ్య వర్గాల షాపులకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఎపి విద్యుత్ నియంత్రణ మండలి ఎపిఇఆర్‌సి కరెంట్ ఛార్జీలపై వినియోగదారుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టిందని, దీనికి జిల్లాలోని వర్తక వాణిజ్య సంఘాలన్నీ అభ్యంతరం తెలియజేస్తూ మెయిల్స్ పంపించాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం తప్పిందని విమర్శించారు. మొదటి దఫాగా రూ.6,072 కోట్లు, రెండో దఫాగా 11,820 కోట్ల రూపాయలు దాదాపు 18 వేల కోట్ల రూపాయల విద్యుత్ ఛార్జీల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపుతోందని విమర్శించారు. తక్షణం కరెంటు ఛార్జీలు పెంచే ఆలోచనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు అయిన ఖర్చు కూడా విద్యుత్తు వినియోగదారుల నుండే వసూలు చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు అమల్లోకి వస్తే సాధారణ మధ్యతరగతి ప్రజానీకం చాలా ఇబ్బందులు పడతారని, సెల్ ఫోన్ రీఛార్జి చేసుకున్న మాదిరిగానే ముందుగానే కరెంటుకు రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కాబట్టి ప్రజానీకం అంత రాష్ట్ర ప్రభుత్వం బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేసిన విద్యుత్తు భారాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 24వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు జరుగుతుందని, దీనిలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



మర్చంట్ ఛాంబర్ జిల్లా అధ్యక్షులు రాజేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష నేతలు

బకాయి వేతనాలివ్వాలని పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

నగర పంచాయతీ కార్మికుల రెండు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు, ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండలాధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు రెండు నెలల నుంచి జీతాల్లేక అర్థాకలితో జీవిస్తున్నారన్నారు. ఇంటి సరుకులు అప్పులు ఇచ్చిన దుకాణదారులు బాకీలు చెల్లించమని నిలదీస్తున్నారన్నారు. ఎఐటియుసి జిల్లా నాయకులు తుర్లపాటి బాబు మాట్లాడుతూ నగర పంచాయతీ ఏర్పడిన దగ్గర నుంచి కార్మికులకు రావాల్సిన పే ఎరియర్స్ రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయన్నారు. ప్రభుత్వ జిఒ ప్రకారం స్వీపర్లకు రూ.21 వేలు జీతాలు చెల్లించడంలేదన్నారు. వెంటనే కార్మికులందరికీ రూ.21 వేల జీతం చెల్లించాలన్నారు. ధర్నాకు సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు సంఘీభావం తెలిపారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ పావనికి వినతిపత్రం అందించారు.



వినతిపత్రం అందిస్తున్న నగర పంచాయతీ కార్మికులు

హమాలీ కార్మికులకు జీతాలు పెంచాలి

సిఐటియు ఆధ్వర్యాన ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ప్రతి రెండేళ్లకోసారి జీతాలు పెంచుతూ ఒప్పందం చేసుకుంటుందని, 2024 జనవరి కల్లా ఆ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా అప్పటి వైసిపి ప్రభుత్వం దానిని విస్మరించిందని యూనియన్ ఎపి పౌరసరఫరాల సంస్థ గోడౌన్స్ జట్టు వర్కర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో హమాలీలు ధర్నా నిర్వహించారు. ఏలూరు, పాతూరు, ధర్మాజీగూడెం, జంగారెడ్డిగూడెం, కుక్కునూరు, కెఆర్.పురం, నూజివీడు, కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్లలో కార్మికులు మండల స్టాక్ పాయింట్ల వద్ద నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షులు శేఖర్ మాట్లాడుతూ యూనియన్‌తో చర్చలు జరిపి తక్షణమే హమాలీల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఒప్పంద కాలం పూర్తయి 11 నెలలైనా ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. కనీసం కూటమి ప్రభుత్వమైన వెంటనే స్పందించి రాష్ట్ర యూనియన్ నాయకులతో చర్చలు జరిపి హమాలీల జీతాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. పౌరసరఫరాల శాఖలో మండల, గ్రామస్థాయిలో నిత్యావసరాలను రేషన్ షాపులకు చేరవేసే కార్మికుల కష్టానికి వెలకట్టలేమన్నారు. రాత్రి, పగలు, ఎండలో, వర్షంలో సైతం కార్మికులు ఎంతో కష్టించి బియ్యం, కందిపప్పు, పంచదార, ఆయిల్ వంటి నిత్యావసర సరుకులను మండల స్టాక్ పాయింట్ల నుంచి గ్రామాల్లో ఉన్న రేషన్ షాపులకు చేరవేస్తున్నారన్నారు. ఒక్కరోజు కూడా ఆలస్యం కాకుండా పని చేస్తున్నారని, వారి కష్టాన్ని ఈ ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి విద్యుత్, విద్య, వైద్యం ఖర్చులు పెరిగి జీతాలు చాలక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి రాంబాబు, దుర్గారావు, మస్తాన్‌వలీ, ముప్పిడి అబ్బులు తదితరులు నాయకత్వం వహించారు.

ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

అబ్బురపర్చిన డ్రాగన్ ఫ్రూట్ సాగు

చేబ్రోలులో వంటను పరిశీలించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలులో రైతు మురళీకృష్ణంరాజు పండిస్తున్న డ్రాగన్ ఫ్రూట్ సాగుతీరును జిల్లా కలెక్టర్ అబ్బురపడి అభినందించారు. 6.8 ఎకరాల విస్తీర్ణంలో రెండు లేయర్లుగా పండిస్తున్న డ్రాగన్ పండు పెంచే విధానాన్ని రైతు కలెక్టర్‌కు వివరించారు. ఎకరానికి దాదాపు రూ.14 లక్షలు పెట్టుబడి అవుతుందని, పూర్తిగా సేంద్రీయ ఎరువులతోనే సాగు చేస్తున్నామని రైతు వెల్లడించారు. దాదాపు 16 ఎకరాల విస్తీర్ణంలో ఆరు ఎకరాల్లో డ్రాగన్ పండు, మిగతా పొలంలో మహాగని, అవకాడో తోట లను పెంచుతున్నారు. వాటిని కలెక్టర్ పరిశీలిం చారు. మహాగని మొక్క నాటిన ఐదేళ్ల తర్వాత పండ్లు కాస్తుం దని, వాటికి మార్కెట్లో మంచి ధర ఉందని తెలిపారు. అదే చెట్టు 30 ఏళ్ల తరువాత కలపకు అంతర్జాతీయ పరంగా మంచి గిరాకీ ఉంటుందని, సముద్రపు ఓడలు, పడవలకు అడుగున మహాగని కలపను వినియోగిస్తారని, ఉప్పు నీటిని తట్టుకుని పాడవని గుణం మహాగని కలప లక్షణమని రైతు వివరించారు.

సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించండి

భీమడోలు :సాగులో యాంత్రీకరణను ఉపయోగించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధన దిశగా రైతులు ప్రయత్నించాలని కలెక్టర్ వెట్రిసెల్వి రైతులకు సూచించారు. మండలంలోని పూళ్ల గ్రామంలో మంగళవారం పైడె వెంకట్రాజు పొలంలో యంత్రాల ద్వారా ధాన్యం నూర్పిళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగులో యాంత్రీకరణ వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుందని, యంత్రాల కొనుగోలుకు 50 శాతం వరకు రాయితీ అందిస్తుందన్నారు. సాగులో యంత్రాల వినియోగం ద్వారా సాగు వ్యయం తగ్గడంతోపాటు, సమయం కూడా ఆదాయం అవుతుందన్నారు.

పరిశోధనా ఫలితాలు ఎప్పటికప్పుడు రైతులకు చేరాలి

భూసార పరీక్షలు, వరికి సోకే తెగుళ్ల నివారణకు సంబంధించిన పరిశోధనా ఫలాలు రైతులకు ఉపయోగపడేలా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి లోని రైతులకు చేరాలని కలెక్టర్ వెట్రిసెల్వి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. భీమడోలులోని అగ్రి ల్యాబ్‌ను కలెక్టర్ పరిశీలించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులను భాగస్వా ములను చేసి, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల వివరాలు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధనకు తీసుకోవాల్సిన చర్యలు, వరి పంటకు సోకే తెగులు నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతు లకు అవగాహన కలిగించాలన్నారు. కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, అసిస్టెంట్ డైరెక్టర్ ఉష రాజకుమారి, వ్యవసాయాధికారి రవికుమార్, తహశీల్దార్ రమాదేవి, మత్స్య శాఖాధికారి లీలదుర్గ, ఎంపిడిఒ పద్మావతి పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్

పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని డిఐజి అశోక్‌కుమార్ పోలీసు సిబ్బందికి సూచించారు. ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, కేసుల స్థితి గతులను ఎస్ఐ టి.సుధీర్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు, నమోదయ్యే కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు, నివారణ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిఐజి మాట్లాడుతూ ప్రజల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈవ్‌టీజింగ్ చేసేవారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాలేజీలు, బస్టాండ్లు, ఆసుపత్రుల వద్ద పెట్రోలింగ్ పటిష్టంగా అమలు చేస్తామన్నారు. బాధితుల ఫిర్యాదు చేయగానే విచారణ జరిపి న్యాయం చేయాలన్నారు. పోలీసులు క్రమశిక్షణగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలన్నారు. చోరీలను నియంత్రించాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి పోలీసుస్టేషన్ పరిసరాలను పరిశీలించి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ముందుగా ఆయన చినవెంకన్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌తో కలిసి దర్శించుకున్నారు. ఆయనతో పాటు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, భీమడోలు, సిఐ విల్సన్ ఉన్నారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న డిఐజి అశోక్‌కుమార్

దోమ కాటు చాలా ప్రమాదకరం

ప్రజాశక్తి - దెందులూరు

దోమ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమకాటు పాము కాటుకంటే ప్రమాదమని, దోమల నిర్మూలన ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యపడుతుందని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామంలో జరుగుతున్న అసంక్రమిత వ్యాధుల సర్వే (నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్)లో పాల్గొని అక్కడి ప్రజలతో మాట్లాడుతూ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న ఇంటింటి క్యాన్సర్, షుగర్, బిపి, దంత సమస్యల సర్వేలో తగు సమాచారం ఇవ్వాలని, అప్పుడే క్యాన్సర్ తదితర వ్యాధులను గుర్తించగలమని చెప్పారు. సకాలంలో గుర్తిస్తే వైద్య చికిత్స సులభతరమవుతుందని చెప్పారు.

రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎత్తిపోతల భూ నిర్వాసిత రైతాంగానికి ఎకరాకు రూ.50 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం మండలాధ్యక్షులు పి.పాండురంగారావు కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎత్తిపోతల పథకానికి రైతాంగం వ్యతిరేకం కాదని, కాని రైతాంగానికి ఎకరాకు రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్వీఎస్.నారాయణ మాట్లాడుతూ తమ న్యాయమైన నష్టపరిహారం కోసం రైతాంగం చేసే పోరాటానికి కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, యువజన సంఘాలు రైతాంగానికి వెన్నుదన్నుగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.అనురాధ, డి.సత్యనారాయణ, ఆర్.ధర్మారావు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

భారతరత్న ఇందిరాగాంధీ 107వ జయంతి వేడుకలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఇందిరా గాంధీ ఆశయాలను అందరం ఆచరించాలన్నారు.

వేలేరుపాడు రూరల్ :ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సంత బజారులోని ఇందిరమ్మ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. చుట్టుపక్కల పిల్లలకు, పెద్దలకు స్వీట్లు పంపిణీ చేశారు.

చాట్రాయి : తమ్మిరెడ్డిపల్లి ఎంపిపిఎస్‌ఎం ఉర్దూ పాఠశాలలో ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలోపాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఎస్‌కె.హసీనా పాల్గొన్నారు.

'ఉపాధి అవకాశాలు కల్పించడమే ఎంపీ ధ్యేయం'

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఏలూరు ఎంపీ పుట్టామహేష్ కుమార్ యాదవ్ పని చేస్తున్నారని టిడిపి మండలాధ్యక్షులు అమరవరపు అశోక్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అమరవరపు అశోక్ అధ్యక్షతన మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ పని చేస్తున్నారన్నారు. ముఖ్యంగా పోలవరం నియోజకవర్గ వంటి వెనుకబడిన ప్రాంతంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో ఎంపీ పనిచేస్తున్నారన్నారు. ఈసమావేశంలో కార్యదర్శి కట్టం రాంబాబు, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి గొంది నాగేశ్వరరావు, శాఖమూరి సంజీవులు, సూపా శ్రీరాములు, కురిమెళ్ల సుధాకర్, కోటేశ్వరి ముత్యాలరావు, పోసి పాల్గొన్నారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - చింతలపూడి

రబీ, వరి, మొక్కజొన్న, అపరాలకు బ్యాంకుల్లో లోన్ లేని రైతులు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఏలూరు ఎడిఎ డిఆర్ సి లలిత సుధా తెలిపారు. పట్టణంలో నాలుగో వార్డులో ఆర్‌బికెలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు మొక్కజొన్న పంటలో సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎకరానికి వరికి రూ.500, మొక్కజొన్న పంటకు రూ.483 ప్రీమియం ఇన్సూరెన్స్ కట్టుకోవాలన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ కోసం దగ్గరలో ఉన్న సిఎస్‌సి సెంటర్లను సంప్రదించాలని, క్రాప్ ఇన్సూరెన్స్‌కి డిసెంబర్ 15వ తేదీ ఆఖరు తేదీ అని, రైతులందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల వ్యవసాయాధికారి మీనాకుమారి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం :మండల పరిధిలోని బీమలవారిగూడెం, పులిరామన్నగూడెం గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల విస్తరణ కార్యక్రమం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ వ్యవసాయానికి కూడా వ్యాపారం లాగా చేయడం ద్వారానే నికర ఆదాయం పొందవచ్చని తెలిపారు. వ్యవసాయంలో కొత్త పద్ధతులను అవలంభిస్తూ, సేంద్రియ వ్యర్థ పదార్థాలు వినియోగిస్తూ వ్యవసాయం చేయడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగం తగ్గించాలన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతులకు ఆధునిక పద్ధతులతో సాగుచేసేను వరి పొలాలను పరిశీలించి రైతులకు తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి సేద్య సిబ్బంది, గ్రామ రైతు సోదరులు హాజరయ్యారు.

నేరాలు - ఘోరాలు

గుండెపోటుతో ట్రిపుల్ ఐటి సెక్యూరిటీ గార్డ్ మృతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటిలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న దుబ్బాక జగజ్జీవన్‌రావు మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుజామున మూడు గంటలకు గుండె నొప్పి రావడంతో అతనితో పాటు విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డులు కొంతమంది జగజ్జీవన్‌రావును నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే జగజ్జీవన్‌రావు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. జగజ్జీవన్‌రావు మృతదేహాన్ని స్వగ్రామమైన కొనసారాజుపాలెం తరలించారు. జగజ్జీవన్‌రావుకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదపాలపర్రులో వెంకట్రావు(48) వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వీరభద్రరావు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెదపాలపర్రుకు చెందిన వెంకట్రావు ఈ నెల 15వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకి వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన చల్లగుళ్ల వెంకటేశ్వరరావు వద్ద పని చేస్తున్నాడు. ఇతను భార్య నుంచి వేరుపడడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. చల్లగుళ్ల వెంకటేశ్వరరావు వద్ద 15వ తేదీ రాత్రి రూ.1500 తీసుకున్నాడు. 16వ తేదీన వెంకట్రావుకు వెంకటేశ్వరరావు ఫోన్ చేశాడు. వెంకట్రావు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఈ నెల 18న గ్రామంలో సత్తిరాజు చెరువులో వెంకట్రావు మృతిదేహం తేలి ఉండడాన్ని స్థానికులు గమనించి వెంకట్రావు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంకట్రావుకు ఇద్దరు సోదరులు ఉన్నారు. మృతుని సోదరుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటుసారా తయారీ స్థావరం పై మంగళవారం జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ అధికారి కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉన్న 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

14 మద్యం సీసాలు స్వాధీనం

నూజివీడు టౌన్ : మండలంలోని సుంకొల్లు గ్రామంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పల్లిపాము సుదర్శనరావు వద్ద 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ బి.రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వైరస్ కాదు... వ్యాధి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలంలో వీధి కుక్కలు డెర్మటిటిస్ అనే వ్యాధితో బాధపడుతున్నాయని, అంటువ్యాధి కాదని అధికారులు తెలిపారు. వీధి కుక్కలకు వింత వైరస్ శీర్షికన ప్రజాశకి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అంటు వ్యాధి కాదని చెప్పారు. చర్మ వ్యాధి వల్ల మనుషులకు ఎటువంటి ప్రమాదం లేదని, ఆ వైరస్ వచ్చిన వీధి కుక్కలకు సిబ్బంది ద్వారా వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు

అక్రమ పద్ధతిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎడిఇ టి.రాజ్‌కుమార్ హెచ్చరించారు. జెడ్‌పి ఆవరణలో రెండు కమర్షియల్ షాపులకు అక్రమ విద్యుత్ వినియోగంపై అధికారులు స్పందించి తనిఖీలు చేశారు. ఎడిఎ టి.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ విద్యుత్ ఆక్రమణ వినియోగం జరగడం లేదని, అన్ని యూనిట్స్ మీటర్‌లో నుంచి వాడుకుంటున్నారని తనిఖీలో గుర్తించినట్లు తెలిపారు. మీటర్ ప్రకారం బిల్లింగ్ కూడా జరుగుతుందని తెలిపారు.

22న చలో ఢిల్లీ

మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అత్యవసర, నిత్యావసర మందులపై జిఎస్‌టి ఎత్తివేయాలని, మందుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 22వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను పవర్‌పేటలోని సిఐటియు కార్యాలయంలో మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లు ఆవిష్కరించారు.

ఘనంగా పురుషుల దినోత్సవం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పురుషుల దినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ మాస్టార్ మాట్లాడుతూ కుటుంబ యజమానిగా, తండ్రిగా, అన్నగా పురుషుడు నిర్వహించే బాధ్యతలు గొప్పవని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు బి.పద్మలత, పద్మావతి, కిరణ్ పాల్గొన్నారు. పురుషులను గౌరవించి సన్మానించి నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

క్రీడా స్కూల్ కాంప్లెక్స్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఎస్‌ఆర్‌ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్రీడా స్కూల్ కాంప్లెక్స్‌ను ఛైర్మన్ డాక్టర్ బి.హేమలత ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయిని హేమలత మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు అనేక విషయాలు నేర్చుకొని విద్యార్థులకు నేర్పించాలని కోరారు. స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌గా రాజేంద్రప్రసాద్, ఉమా మహేశ్వరి, నాగేశ్వరరావు, హర్ష, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మి, అన్నామణి, హర్ష, సుధాకర్, సుగుణరావు, స్వప్న, ఆలీఖాన్, నాగరాజు, సుకుమార్, సతీష్, రాణి, ప్రభాకర్, ప్రమిలారాణి, సరళ, నాగమణి, హేమాదేవి, మల్లేశ్వరమ్మ, రాజేశ్వరి, భవాని పాల్గొన్నారని నూజివీడు నియోజకవర్గ స్కూల్స్ కాంప్లెక్స్ సెక్రటరీ రవీంద్ర తెలిపారు.

ఒటిఎస్ ద్వారా అసలు, వడ్డీ కొంతవరకు మాఫీ

ప్రజాశక్తి - పోలవరం

2020 డిసెంబర్ 31 సంవత్సరానికి ముందు వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు రెన్యువల్ చేసుకోకపోయినా, కట్టకపోయినా రైతులందరూ వన్ టైం సెటిల్‌మెంట్ చేసుకోవడం వల్ల వడ్డీలో కొంత మాఫీ, అసలులో కొంత మాఫీ అయ్యే అవకాశం ఉందని పోలవరం ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రుణాలు వన్ టైం సెటిల్‌మెంట్ చేసుకుని క్లియర్ చేసుకున్న రైతులకు నెల రోజుల తర్వాత కొత్త రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో కట్టకపోవడం వల్ల రూపాయి వడ్డీ పడడంతో రైతులకు భారమవుతుందని, వన్ టైం సెటిల్‌మెంట్ చేసుకుని రుణాలు క్లియర్ చేసుకుని, మళ్లీ రుణాలు తీసుకోవడం వల్ల 25 పైసలు వడ్డీ మాత్రమే వర్తిస్తుందని, దీంతో రైతుకు భారం తగ్గుతుందని మేనేజర్ రవికుమార్ తెలిపారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

ప్రజాశక్తి - కలిదిండి

ఉపాధి హామీ పనుల కల్పనకు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ముగ్గులతో పంచాయతీ పటాన్ని తీర్చిదిద్దినట్లు సర్పంచి గూడవల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెంకటాపురంలో వంద రోజుల ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ యాప్‌లో పిఆర్‌ఎను పొందుపరచాలన్నారు. పంచాయతీ పరిధిలోని ఉపాధి పనులు జియో ట్యాగింగ్ చేసినవి సైట్‌లో కనిపిస్తాయన్నారు. దీంతో ఉపాధి హామీ కూలీలకు పనులు చూపేందుకు వీలు కలుగుతుందన్నారు. విఆర్ఓ దాసరి కమలహాసన్, ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డి అప్పలనాయుడుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎపిఎస్ ఆర్‌టిసి రీజనల్ బోర్డు (విజయవాడ జోన్) ఛైర్మన్‌గా జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పల నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఆయనను మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పలువురు ప్రముఖులు, పలు డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పూల బొకేలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఏలూరులో తాను చేసిన సుదీర్ఘ పోరాటానికి ఫలితంగా ఎపిఎస్‌ఆర్‌టిసి రీజనల్ ఛైర్మన్‌గా నియమితులయ్యారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరుకు చెందిన పలువురు ప్రముఖులు, వివిధ డివిజన్లకు చెందిన జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతాంగానికి భరోసా, చట్టబద్ధత కల్పించాలి

సిపిఎం, రైతు సంఘం నాయకులు

చర్చాగోష్టిలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విత్తన మొక్కజొన్న పంట సాగులో నష్టపోతున్న రైతంగానికి భరోసా, చట్టబద్ధత కల్పించాలని సిపిఎం, సిపిఐ, రైతు సంఘం నాయకులు కోరారు. నూజివీడు ఆర్‌డిఒ కార్యాలయంలో విత్తన కంపెనీలు, విత్తన ఆర్గనైజర్లు, రైతు సంఘం నాయకులు, సిపిఎం నాయకులు, నూజివీడు డివిజన్ వ్యవసాయ అధికారులు, రైతు సేవ సంఘం సిబ్బందితో చర్చా గోష్ఠి కార్యక్రమం ఆర్‌డిఒ ఎం.వాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు పి.జమలయ్య, నిమ్మగడ్డ నరసింహరావు, సిపిఎం నాయకులు జి.రాజు మాట్లాడుతూ నూజివీడు వ్యవసాయ డివిజన్‌లో నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లో ప్రతి రబీ సీజన్‌లో సుమారు 40 వేల ఎకరాల్లో విత్తన మొక్కజొన్న సాగు చేస్తున్నారని, సుమారు 1500 ఎకరాల్లో విత్తన పత్తి సాగు చేస్తున్నారని తెలిపారు. గుర్తుతెలియని సీడ్ ఆర్గనైజర్లు కొంతమంది రైతులకు లాస్‌గా ఉన్న మొక్కజొన్న విత్తనాలు ఇచ్చి విత్తన పంటలు వేయించి, పిదప విత్తన పంట హైబ్రిడ్‌కు బై బ్యాక్ పేరున కొంటున్నారన్నారు. ఈ విషయంలో ప్రతి సంవత్సరం కొంతమంది రైతులు నకిలీ విత్తనాల బారినపడి పంట నష్టపోవడమే కాకుండా విత్తన కంపెనీ ఆర్గనైజర్ల నుంచి పంట నష్టపరిహారం అందకుండా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విత్తన చట్టం మార్చాలని కోరారు. దీనిపై నూజివీడు ఆర్‌డిఒ ఎం.వాణి, వ్యవసాయ సహాయ ఉపసంచాలకులు జి.విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఎవరైనా సీడ్ ఆర్గనైజర్ అమాయక రైతులను ఎలాంటి రాసీదు ఇవ్వకుండా మోసం చేస్తే క్రిమినల్ కేసు పెట్టి శిక్ష పడేలా చేస్తామని హెచ్చరించారు. విత్తన చట్టం సవరణ తమ పరిధిలో లేదని, ఈ విషయంలోనే లోటుపాట్లను ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని నూజివీడు వ్యవసాయ సహాయ ఉపసంచారకులు జి.విద్యాసాగర్, డివిజన్ మండల వ్యవసాయ అధికారులు ఎ.చాముండేశ్వరి, ఎస్.మధుమోహన్, చెన్నారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల రైతు సేవా కేంద్రాల సిబ్బంది వివిఎ, విహెచ్‌ఎలు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం పకడ్బందీగా అమలవ్వాలి

ఏలూరు :వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. డబ్ల్యుఎస్ఎం (డిస్ట్రిక్ట్ వాటర్ శానిటేషన్ మిషన్) జిల్లా స్థాయి కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన మంగళ వారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో నిర్వహించారు. కమిటీకి కన్వీనర్‌గా ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వ్యవహరించగా మరో పది శాఖల జిల్లా అధికారులు కమిటీలో సభ్యులుగా ఉన్నట్లు జాయింట్ కలెక్టర్ ప్రకటించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత టాయిలెట్ వినియోగంపై జిల్లా వాటర్, శానిటేషన్ మిషన్ ప్రచురించిన అవగాహనా వాల్‌పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. వరల్డ్ టాయిలెట్ డే పురస్కరించుకుని మంచి పారిశుధ్య సేవలందిస్తున్న పలువురు క్లాప్ మిత్రులను జాయింట్ కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లా డుతూ కుళాయి కనెక్షన్‌లతో స్వచ్ఛమైన నీటిని ప్రతి ఇంటికీ అందించడమే లక్ష్యమన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత కమిటీదేనని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందించడం, వ్యక్తిగత మరుగుదొడ్లు, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం పకడ్బందీగా అమలయ్యేలా చూడాల్సి న బాధ్యత కమిటీపై ఉందన్నారు. వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాల్లో అధికారులు లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

ఆయిల్‌పామ్ రైతులు రాయితీలను వినియోగించుకోండి

చాట్రాయి:ఆయిల్‌పామ్ రైతులు రాయితీలను వినియోగించుకోవాలని ఉద్యానవన శాఖ మండల అధికారి ఆర్.హేమ సూచించారు. మండలంలోని బూరుగుగూడెం, చనుబండ గ్రామాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాజమాన్య పద్ధతుల్లో సాగు చేయాలని, రైతులు యంత్ర పరికరాలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను ఉపయోగించుకోవాలని, ఒక ఏడాది నుంచి నాలుగేళ్ల లోపు పామాయిల్ మొక్కలు ఉన్నా, అంతర పంటలు వేసుకున్నా రాయితీలు వర్తిస్తాయని చెప్పారు. గోద్రెజ్ కంపెనీ మేనేజర్ వియు.శ్యామ్‌నందన్‌రావు పాల్గొని మాట్లాడుతూ పామాయిల్ సాగు చేయాలనుకున్న రైతులకు అందుబాటులో మొక్కలు ఉన్నాయని, ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, రైతులు, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షితమైన మరుగుదొడ్డి మానవ హక్కు

ప్రజాశక్తి - ఉంగుటూరు

సమాజంలోని ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్డి కలిగి ఉండాలని, సురక్షితమైన మరుగుదొడ్డి మానవ హక్కు అని నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, హెల్త్, హైజీన్ క్లబ్, గ్రామ పంచాయతీల సంయుక్త ఆధ్వర్యంలో మానవహారం, అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సురక్షితమైన మరుగుదొడ్డి మానవ హక్కు అని అన్నారు. గ్రామ సర్పంచి దిడ్ల అలకనంద శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు పరిశుభ్రమైన మరుగుదొడ్ల ఆవశ్యకతపై నినాదాలతో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సబ్బులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి జి.హెప్సీబా, హెల్త్ క్లబ్ కో-ఆర్డినేటర్ షేక్ ఆయేషా, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెడ్డియ్య, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు మధ్యవర్తుల చేతుల్లో మోసపోవద్దు

వేలేరుపాడు రూరల్ :మండలంలోని రైతులు, దళారులు మధ్యవర్తుల చేతుల్లో మోసపోవద్దని తహశీల్దార్ డి.వి.సత్యనారాయణ తెలిపారు. మేడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం పంట నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. పంటను నమోదు చేసుకుని ఇకెవైసి పూర్తి చేయించుకున్న రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడానికి లేబర్ ఛార్జీలు, ఉచిత గోనె సంచులు సరఫరా చేసి, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ పి.సమీరజా, డిసిఎంఎస్ పిఎస్ఎ ఇన్‌ఛార్జి సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.

పిఎం ఫసల్ బీమా యోజనను వినియోగించుకోండి

ఏలూరు :ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన-2024 కింద వరి పంటకు ప్రీమియం చెల్లించేందుకు డిసెంబర్ 31 చివరి తేదీ అని, మొక్కజొన్న, మినుము,పెసర పంటలకు ప్రీమియం చెల్లించేందుకు డిసెంబర్ 15 ఆఖరు తేదీ అని, ఈ గడువు లోపలే రైతులు తమ పంటలు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా తెలిపారు. ఖరీఫ్ సీజనుకు సంబంధించి రైతులు కట్టాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించిందని, ప్రస్తుతం రబీ 2024-25నకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులే ప్రీమియాన్ని చెల్లించాల్సి ఉందన్నారు. జీడి మామిడికి ప్రీమియం గడువు శుక్రవారంతో ముగిసిందన్నారు. మామిడికి ఎకరాకు రూ.2,250 ప్రీమియాన్ని చెల్లించి నమోదు చేయించుకోవచ్చన్నారు. డిసెంబర్ 15 చివరి తేదీ అని తెలిపారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ఏలూరులో....

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాలల గ్రంథాలయంలో మహిళా సాధికారత, అభయ చట్టం గురించి చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది కానాల రామకృష్ణ, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం సెక్రటరీ గుడిపాటి నరసింహరావు హాజరయ్యారు. మహిళలపై జరుగుతున్న హింస గురించి బాలికలపై జరుగుతున్న అత్యాచారాల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటి గురించి వారు వివరించారు. విద్యార్థులు తమ చుట్టూ జరుగుతున్న పరిస్థితులను గమనించాలని సూచించారు. మహిళ ఉపాధ్యాయులను ఎన్‌వి.గంగాభవాని, శిరీషలను సన్మానించారు. అనంతరం విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీ నిర్వహించారు.

ఏలూరు సిటీ :ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో హేలాపురి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పివి.రమణ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొడాలి అనురాధ, జిల్లా పంచాయతీ అధికారి, హేమలత సర్ సిఆర్‌ఆర్ కాలేజీ లెక్చరర్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి టి.రాజేశ్వరి ఆధ్వర్యంలో మహిళల ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు, డిబేట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు నిర్ణయించినట్లు ఆమె తెలిపారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో మహిళా సాధికారత అంశంపై సెమినార్ నిర్వహించి, జూనియర్ కాలేజీ విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.విజయదుర్గ, ఆశావర్కర్ పి.వెంకటలక్ష్మి, గ్రంథాలయాధికారి డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ముదినేపల్లి, గురజ శాఖ గ్రంథాలయాల్లో విద్యార్థినులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్, గౌతమ్ స్కూల్ విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయాల నిర్వాహకులు శ్రీదేవి, ఝాన్సీ పాల్గొన్నారు.

వాతావరణ ఆధారిత పంట బీమా వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు

మామిడి, జీడి మామిడి తోటలకు సంబంధించి వాతావరణ ఆధారిత పంట బీమా సౌకర్యాన్ని రైతులు వినియోగించుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి డాక్టర్ ఎస్.రామ్మోహన్ తెలిపారు. జిల్లాలో సుమారు 36 వేల ఎకరాల మామిడి పంట సాగులో ఉందన్నారు. ప్రతి ఏడాది మామిడికి ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల రైతులు ఎక్కువగా నష్టపోతున్నారని, రైతులను ఆదుకోవడం కోసం మొట్ట మొదటిసారిగా మామిడి పంటకు ప్రభుత్వం వాతావరణ ఆధారిత పంట బీమాను కల్పిస్తుందని తెలిపారు. ఇందులో ఎకరానికి రూ.45 వేల నష్టపరిహారం పొందవచ్చని, ఇందుకు రైతులు ఇ-పంటలో కచ్చితంగా పంట నమోదు చేసుకొని ఉండాలన్నారు. మామిడి రైతులందరూ ఎకరానికి రూ.2250 ప్రీమియం చెల్లించాలని, ఈ ఏడాది డిసెంబరు 15 ప్రీమియం చెల్లించేందుకు ఆఖరి తేది అని తెలిపారు. జి వాతావరణ ఆధారిత పంట బీమాను పొందేందుకు జీడిమామిడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మామిడి పంటకు ఎకరాకు రైతు చెల్లించాల్సిన ప్రీమియం రూ.2250, పంట నష్టానికి ఎకరానికి గరిష్టంగా చెల్లించే బీమా రూ.45 వేలు అని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం లేదా 1బి పత్రం, ఆధార్ నకలు, బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ నకలు, పంట నిర్ధారణ ధృవీకరణ పత్రం రైతులు సమర్పించాలన్నారు.

మత్తు వదిలితేనే భవిష్యత్తు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని యనమదల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు వదిలితేనే భవిష్యత్తు అనే అంశంపై వకృత్వ పోటీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ డి.వెంకటేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి బాటలో నడవాలని, చెడు అలవాట్లకు లోను కావొద్దని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్సన్ మాట్లాడుతూ ఈ పోటీలను నిర్వహించిన నవజీవన్ బాల భవన్ వారికీ కృతజ్ఞతలు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జోజప్ప, భాగ్య పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

విషయం : నా కుమారుడు SSC సర్టిఫికెట్ నందు నా ఇంటి పేరులో గల అక్షర దోషమును సరిచేసుకుంటున్న విషయమును పత్రికాముఖంగా తెలియపరచుట గురించి.
మా కుమారుడు అయిన తన్నీడి అనీల్ కుమార్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, భీమవరంలో SSC చదవడం జరిగింది. మా కుమారుడి యొక్క SSC సర్టిఫికెట్‌లో నా యొక్క పేరు **TANNIDI KANAKARAJU** గా ముద్రించబడినది. కానీ నా యొక్క అసలు పేరు **TANNEDI KANAKARAJU** నా ఇంటి పేరులో గల దోషమును సరిచేసుకుంటున్నాను. ఈ విషయాన్ని పత్రికాముఖంగా ప్రజలందరికీ తెలియజేసుకుంటున్నాను.
ఇట్లు
తన్నీడి కనకరాజు
కోమటి తిప్ప పంచాయితీ
నీటితిప్ప గ్రామం, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా

దస్తావేజు పోయినది

శ్రీమతి **మంతెన మరియమ్మ,** భర్త గంగరాజు, ఆర్.ఎస్.నెం.43/13 కొండలరావు పాలెం, పెదవేగి మండలం, అను నాకు గల ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్ నెం.3386/1999లు మా ఇంటి వద్ద నుండి బ్యాంక్ లోను నిమిత్తం తీసుకుని వెళ్ళుచుండగా మార్గమధ్యంలో విజయరాయి సమీపంలో పడిపోయినవి. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌లో తెలియజేయవల్సినదిగా కోరుచున్నాను.
మంతెన మరియమ్మ, భర్త గంగరాజు,
కొండలరావుపాలెం, పెదవేగి మండలం,
ఏలూరు జిల్లా. సెల్: 9849333808.

పాస్‌పోర్టు పోయినది

పాలకొల్లు రూరల్ పంచాయతీలో డోర్. నెంబర్.11-24, బోళ్ళవాని తోట, నాగరాజు పేట, పాలకొల్లు రూరల్ పంచాయతీ, ప.గో.జిల్లా, ఎ.పి లో నివసిస్తున్న **షేక్ హుస్సేన్,** తండ్రి షేక్ నాగూర్ తెలియజేయునది ఏమనగా నేను ది **04- 10-2012**లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి K8532385 పాస్ పోర్ట్ తీసుకున్నాను. మేము మా ఇళ్ళు ది **29-10-2024**న షిఫ్ట్ అయిన సందర్భంగా నా ఒరిజినల్ పాస్ పోర్ట్ మిస్ అయినది. ఎంత వెతికినా దొరకలేదు కాబట్టి ఎవరికైనా దొరికితే నాకు అందజేయవలసిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.
సెల్ నెంబర్ : **9110585129**

స్కూలు సర్టిఫికేట్ పోయినది

ఏలూరు జిల్లా, చిన నింద్రకోలను గ్రామానికి చెందిన **మంత్రబుద్ది చిన అప్పారావు** కుమారుడు మంత్రబుద్ది శివ కన్న కుమార్ కి చెందిన పదవ తరగతి స్కూలు సర్టిఫికెట్ జిరాక్స్ నిమిత్తం చిననింద్రకోలను నుండి మోటారు సైకిల్ పై నిడమర్రు వెళ్ళి జిరాక్స్ తీసుకుని తిరిగి చిననింద్రకోలను వస్తుండగా సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలుతో ఉన్న సంచి మార్గ మధ్యంలో పడిపోయినవి. ఎంత వెదికినా దొరకలేదు. కావున సర్టిఫికేట్ జిరాక్స్ ఉన్న సంచి దొరికితే ఈక్రింది అడ్రస్‌కి ఇవ్వగలరు.
మంత్రబుద్ది శివ కన్న కుమార్,
తండ్రి చిన్న అప్పారావు, చిన నింద్రకోలను (పత్తేపురం), నిడమర్రు మండలం
ఏలూరు జిల్లా. 9849481317

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
S.O.P.No.3/2024

బిట్వీన్ :
పిటీషనర్స్ :
1.వంగమామిడి వెంకట సుబ్బారావు
2.వంగమామిడి మాధవ కృష్ణ నిఖిల్
3.వంగమామిడి జయశ్రీ నాగసాయి
Vs
రెస్పాండెంట్స్ : - నిల్-

పై నంబరు పిటిషన్‌లో నర్సాపురం వాస్తవ్యులైన లేటు వంగమామిడి వీర దుర్గా రామలక్ష్మి గార్కి వారసులుగా పిటిషనర్స్‌ను డిక్లేర్ చేయమని కోరుచూ పిటిషనర్స్ పై నంబరు పిటిషన్ దాఖలు చేసుకునియున్నారు. సదరు పిటిషన్‌ను పై కోర్టు వారు ది.**12-12-2024**వ సం. తేదీన వాయిదా వేసియున్నారు. కావున పై నంబరు పిటిషన్‌పై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న ఎడల వారు వాయిదా తేది అయిన ది.**12-12-2024** సం. తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకున్న ఆక్షేపణలు తెలియచేయవలెను. లేనిచో పిటిషనర్స్ పక్షముగా తీర్మానించబడును.
(By Order of the court)
కొప్పర్తి వెంకట సుబ్రహ్మణ్యం, బి.కాం., బియల్.,
నర్సాపురం అడ్వకేటు, నర్సాపురం, ప.గో.జిల్లా.
తేది.19-11-2024 సెల్ :9866068748.

MUNICIPAL CORPORATION, ELURU
e-PROCUREMENT TENDER NOTICE No: 66-68/General/2024-25, Dated. 18-11-2024

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Supply and Delivery of LED Street Lights to Municipal Corporation, Eluru"** Total No of works is 3 with an amount of Rs. 29.30 Lakhs.

Tender schedules are available on e-procurement market place from 20-11-2024. Last date of receipt of tenders is 23-11-2024. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU